జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 21 | జూన్ | 2026 ◆ పేజీలు : 7

## భద్రగిరి మార్ట్‌లో నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశం
- గిరిజన రైతులు, మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రాధాన్యత



**భద్రాచలం టౌన్ , జూన్ 20 ప్రజాజ్యోతి** గిరిజన రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఏర్పాటు చేసిన 'భద్రగిరి మార్ట్'ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో మార్ట్ నిర్వహణ, రికార్డుల నమోదుపై అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. భద్రగిరి మార్ట్‌కు వచ్చే వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన నిత్యావసర సరుకులను ఎప్పటికప్పుడు

మిగతా 2 లో...




# పాల్వంచలో...
# ఏజెన్సీ చట్టానికి తూట్లు..

2 లో..

- అక్రమ పార్టిషన్ డీడ్ రిజిస్ట్రేషన్లు, ప్రైవేట్ ఫైనాన్స్ రుణాలపై అనుమానాలు
- అధికారుల పాత్రపై ప్రశ్నలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిసర ఏజెన్సీ ప్రాంతాల్లో భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల రుణాల వ్యవహారాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా షెడ్యూల్డ్ ఏరియాల్లో అమల్లో ఉన్న 1/70 (వన్ ఆఫ్ సెవెంటీ) చట్టం ఉల్లంఘనకు గురవుతోందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

● పాల్వంచ, ప్రజాజ్యోతి

## రాజి మార్గమే రాజ మార్గం

- జాతీయ లోక్ అదాలత్ లో 807 కేసులు పరిష్కారం: జడ్జి



**ఇల్లందు, జూన్ 20 (ప్రజాజ్యోతి):** రాజీమార్గమే రాజ మార్గమని ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం అన్నారు. శనివారం స్థానిక ఇల్లందు కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ లో 807 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. కక్షిదారులు గ్రామస్థాయిలో క్షణికావేశలకు వెళ్లకుండా సామరస్యంగా జీవనం, ఆదర్శ జీవితం గడపాలని, విలువైన సమయాన్ని డబ్బును వృధా చేసుకోకుండా పంతాలకు పోకుండా క్షణికావేశంలో పెట్టుకున్న రాజీ పడదగిన కేసులు ఇరుపక్షాలు సమన్వయంతో కోర్టుకు వచ్చి రాజి కుదుర్చుకొవచ్చని సూచించారు. ఈ నిర్వహించిన గృహింస, మనోవర్తి, చెక్ బౌన్స్, సివిల్ ధావాలు, బ్యాంకు కేసులు పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖాసీమ్, సీనియర్ న్యాయవాదులు ఎన్ మల్లికార్జునరావు, పి బాలకృష్ణ, దంతాల ఆనంద్, పెద్దూరి వెంకట నరసయ్య, జూనియర్ న్యాయవాదులు కె ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తిక్, కోర్టు సూపరిండెంట్ శ్రీరంగం రామకృష్ణ, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరపల్లిలో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్. తెల్లం వెంకట్రావు



**చర్ల, జూన్ 20 (ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు అన్నారు . శనివారం చర్ల మండలంలోని దేవరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల పురోగతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో

మిగతా 2 లో...

## సంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి

- పాయం వెంకటేశ్వర్లు



**గుండాల, జూన్ 20, ప్రజాజ్యోతి** సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్మణ్ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రం లోని రైతు వేదికలో జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉండేలా సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ మరోవైపు అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తున్నామని మండలంలో ఈ గ్రామంలోనైనా మట్టి రోడ్డు ఉండొద్దన్నది తన అభిప్రాయం అన్నారు విడుదలవాడిగా సిసి రోడ్లను మంజూరు చేస్తూ అవసరమైన చోట బీటీ రోడ్లను వేస్తున్నామని అన్నారు కిన్నెరసాని వాగు పై ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణాన్ని పునర్ నిర్మించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నామన్నారు మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మిగతా 2 లో...

## దేవరపల్లిలో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి... )

రహదారుల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంలో కూడా సౌలభ్యం కలుగుతుందని వివరించారు. గతంలో అభివృద్ధికి నోచుకోని అనేక గ్రామాల్లో ప్రస్తుతం వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామ అవసరాలను గుర్తించి దశల వారీగా నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. దేవరపల్లి ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు ఈ పనులతో పరిష్కారం లభించనున్నదని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతమైన అమలుకు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు, లంక రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి



(మొదటి పేజీ తరువాయి... )

ముమ్మురంగ నడుస్తుందని కొన్ని ఇండ్లు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేశారని అన్నారు రానివారు బాధపడొద్దని రెండో విడత లిస్ట్ సిద్ధంగా ఉందని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారికలను సహకారం చేస్తామన్నారు అనంతరం షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బత్తిని సంగీత, మండల అభివృద్ధి అధికారి బాలరాజు, ఏవో వెంకటరమణ, సీఐ తిరుపతి, ఎస్సె శ్రావణ్ కుమార్, సర్పంచులు కోరం సీతారాములు ఈసం సంజీవరావు, కల్తీ కృష్ణవేణి, ఈసం సుమలత, భూక్య మంగమ్మ రాధా తదితరులు పాల్గొన్నారు.

## భద్రగిరి మార్ట్‌లో నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలి

(మొదటి పేజీ తరువాయి... )

అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. మార్ట్‌కు సరఫరా చేసే సరుకుల నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న రైతులను గుర్తించేందుకు జీసీసీ, డీఆర్ డీపోలలో పనిచేస్తున్న ఐదుగురు నిష్ణాతులైన సేల్స్‌మెన్‌లను ప్రత్యేకంగా కేటాయించాలని అధికారులకు సూచించారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్లు వంటి ఉత్పత్తుల నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని, ప్యాకేజింగ్ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, నిర్వహణలో ఎలాంటి లోపాలు జరగకూడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, ఈఈ (ట్రైబల్ వెల్ఫేర్) మధుకర్, డీఎం (జీసీసీ) సమ్మయ్య, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పవర్ వేణు, హెచ్‌ఎంటీసీ ఉదయ్ కుమార్, ఏడీఏ (అగ్రికల్చర్) తాతారావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, భద్రగిరి మార్ట్ మేనేజర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.




# పాల్వంచలో... ఏజెన్సీ చట్టానికి తూట్లు..

- అక్రమ పార్టిషన్ డీడ్ రిజిస్ట్రేషన్లు, ప్రైవేట్ ఫైనాన్స్ రుణాలపై అనుమానాలు
- అధికారుల పాత్రపై ప్రశ్నలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిసర ఏజెన్సీ ప్రాంతాల్లో భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల రుణాల వ్యవహారాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా షెడ్యూల్డ్ ఏరియాల్లో అమల్లో ఉన్న 1/70 (వన్ ఆఫ్ సెవెంటీ) చట్టం ఉల్లంఘనకు గురవుతోందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.**

● పాల్వంచ, ప్రజాజ్యోతి

స్థానికుల ఆరోపణల ప్రకారం, ఏజెన్సీ ప్రాంతాల్లోని కొన్ని ఆస్తులకు సంబంధించి పార్టిషన్ డీడ్ (విభజన పత్రాలు) పేరిట రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, అనంతరం వాటి ఆధారంగా ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు పొందుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలుస్తోంది. సాధారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూముల బదలాయింపుపై ప్రత్యేక చట్టపరమైన పరిమితులు ఉన్నప్పటికీ, వాటిని పక్కనబెట్టి కొన్ని లావాదేవీలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కనపడని వన్ ఆఫ్ సెవెంటీ చట్టం

గిరిజనుల భూములను రక్షించేందుకు అమల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియాస్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్, 1/70 చట్టం అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చట్టం ప్రకారం గిరిజన భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రత్యేక నిబంధనలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న కొన్ని రిజిస్ట్రేషన్లు ఆ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### గ్రామ పంచాయతీ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు ఎలా?

ఏజెన్సీ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న కొన్ని ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఎలా జారీ అవుతున్నాయన్న అంశంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఇలాంటి ఆస్తుల యాజమాన్యం, హక్కులు, చట్టబద్ధత వంటి అంశాలను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### అక్రమ రిజిస్ట్రేషన్లతో రుణాల మంజూరు

కొంత మంది దళారులు రిజిస్ట్రేషన్ పత్రాలను చూపిస్తూ ప్రజలకు భారీ మొత్తంలో రుణాలు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టపరమైన స్పష్టత లేని ఆస్తులను తాకట్టు పెట్టించి రుణాలు మంజూరు చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా ఆందోళనకు గురిచేస్తోంది.

### అధిక వడ్డీలతో ప్రజలపై భారం

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, మధ్యవర్తులు అధిక వడ్డీ రేట్లతో రుణాలు అందిస్తున్నారని, రుణగ్రహీతలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు వాపోతున్నారు. కొంతమంది కుటుంబాలు అప్పుల ఊబిలో చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నట్లు సమాచారం.

### ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు ఏజెన్సీ చట్టం వర్తించదా?

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆస్తులను తాకట్టు పెట్టి రుణాలు మంజూరు చేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టపరంగా ఇలాంటి లావాదేవీలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికార యంత్రాంగం స్పందించాలంటున్న ప్రజలు

ఇంతటి ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఐటీడీఏ మరియు ఇతర శాఖల అధికారులు స్పందించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు.

### కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిపై సందేహాలు

కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఏ ఏ గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలు వస్తాయనే విషయంపై కూడా ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్లు ఏ నిబంధనల ప్రకారం జరుగుతున్నాయో అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు.

### ఆర్టీఐ ద్వారా వివరాలు సేకరణకు సిద్ధం

ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు త్వరలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు దాఖలు చేయనున్నట్లు పలువురు సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్లు, పార్టిషన్ డీడ్లు, భూ లావాదేవీలు, రుణాల మంజూరు వంటి అంశాలపై అధికారిక సమాచారం వెలుగులోకి వస్తే అసలు వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు, ప్రైవేట్ ఫైనాన్స్ రుణాల వ్యవహారాలపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



# ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతున్నాయా..?

- **మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్పీ సీఈవో బి. నాగలక్ష్మి**
- **సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై సమగ్ర సమీక్ష**



**టేకులపల్లి,జూన్20,ప్రజాజ్యోతి:** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా అనే అంశంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి (సీఈవో) బి. నాగలక్ష్మి శనివారం టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ పథకం సిబ్బంది, క్షేత్ర సహాయకులు,సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు.ముఖ్యంగా ఇందిరమ్మ గృహాల చెల్లింపులు, వనమహోత్సవం,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాల పురోగతిని వివరంగా పరిశీలించారు.పథకాల అమలు లో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హ లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఈవో సూచించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధనలు, మార్గదర్శకాలపై సిబ్బందికి అవగాహన కల్పించి, పనితీరును మరింత మెరుగుపర్చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రనాథ్, మండల పంచాయతీ అధికారి విక్రమ్, ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారి కాళంగి శ్రీనివాస్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తిరుపతి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే.. ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **ప్రతి ఎకరాకు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ద్వేయం... పాయం వెంకటేశ్వర్లు**



**గుండాల జూన్ 20 ప్రజా జ్యోతి** రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పినపాక శాసనసభ్యులు భయం వెంకటేశ్వర్లు అన్నారు శనివారం మండలంలో పర్యటించిన అనంతరం పడుకొని గూడెం గ్రామ సమీపంలో నిర్మించిన పరిశీలించారు. సాగునీరు లేని ఎడల నా దృష్టికి తీసుకొచ్చినట్లయితే అధికారులతో సర్వే నిర్వహించి అణువైన చోట చెక్ డ్యాము నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. చెక్ డ్యాముల ద్వారా నీరు నిల్వ ఉండడమే గాక భూగర్భ జలాలు పెరుగుతాయని తద్వారా బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుందని అన్నారు రైతులు నీటిని వృధాగా పోనీయకుండా క్రమ పద్ధతిలో సేద్యం చేసుకోవాలని విత్తనాలు ఎరువులపై పూర్తి అవగాహన ఉండాలని ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదింపులు చేసుకొని అవసరం ఉన్న పంటలను పట్టించుకోవాలని కోరారు రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని , రైతు బాగున్నపుడే అందరూ బాగుండాలని తద్వారా దేశ బాగుంటుందన్నారు రైతుల కళ్ళలో ఆనందాన్ని నింపడమే ప్రజా ప్రభుత్వ దేయమని అన్నారు.

# ప్రజా మరుగుదొడ్ల పరిస్థితి ఏమిటి..?

- **సగంలోనే నిలిచిపోయిన నిర్మాణ పనులు**
- **మహిళలు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**
- **స్పందించాలని అధికారులకు ప్రజల విజ్ఞప్తి**
- **స్వచ్ఛ భారత్ మిషన్ పరిస్థితి ఏమిటి..? అని ప్రశ్నిస్తున్న ప్రజలు**

**టేకులపల్లి,జూన్20,ప్రజాజ్యోతి:** స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాల్సిన ప్రజా మరుగుదొడ్ల నిర్మాణ పనులు టేకులపల్లి మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో సగంలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఏ కారణంతో నిలిచిపోయాయనే విషయంపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టిన పనుల అమలు తీరుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నా యని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు పారిశుద్ధ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. మండల కేంద్రానికి వివిధ గ్రామాలు, సమీప ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుండగా, ప్రజా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు అత్యంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు ఎవరికి చెప్పుకోలేని సమస్యలను ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజా మరుగుదొడ్లు కీలక పాత్ర పోషిస్తాయని, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పనులు నిలిచిపోవడానికి గల కారణాలను వెల్లడించి, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాల్సిన సమయంలో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలు సగంలోనే నిలిచిపోవడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



**ఇల్లందు, జూన్ 20 (ప్రజా జ్యోతి)** రైతుల పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ విమర్శించారు. శనివారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఒకటై రైతులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రైతుల పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేస్తామని ఎన్నికల్లో ప్రగాల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు కొనుగోలు విషయంలో డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. కేంద్రం ఎంత ధాన్యం కొనుగోలు చేస్తే అంతే తాము రైతుల వద్ద కొనుగోలు చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా ఈ విషయాన్ని ప్రకటించడం పట్ల తన సహచర మంత్రివర్గంలో వ్యతిరేకత మొదలైందని ఇది పూర్తిగా రైతాంగ వ్యతిరేక చర్యలని తెలిపారు. ఎలాంటి నియమనిబంధన లేకుండా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేశామని, కెసిఆర్ 10 ఏళ్ల పాలనలో ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగలేదని, ఈ విషయం నేడు రైతాంగానికి అర్థం అవుతుందని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు రైతాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ధాన్యాలు కొనుగోలు విషయంలో రైతులకు న్యాయం చేసేందుకు కార్యక్రమాలు చేపడతామని, రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, టేకులపల్లి పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, నాయకులు సిలివేరు సత్యనారాయణ, ఎస్ రంగనాథ్, భూక్యా దళ్ సింగ్ నాయక్, జబ్బార్, దాస్యం ప్రమోద్ కుమార్, తోట లలిత శారదా, శీలం రమేష్, నెమలి ధనలక్ష్మి, సూర్నపాక సత్యనారాయణ, బొమ్మెర ప్రసాద్, బావుసింగ్, అబ్దుల్ నబి, ఘాజీ, కాసాని హరిప్రసాద్, నీలం రాజశేఖర్, బండారు శ్రీను, ఉపేందర్, గిన్నారపు రాజేష్, పాబోలు మణి కిరణ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ద్వేయం

- **పాయం వెంకటేశ్వర్లు**





**గుండాల. జూన్ 20. ప్రజా జ్యోతి** విద్యారంగా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏపీఆర్జే గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన సమగ్ర విద్యాసమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల, ప్రాథమికున్నత పాఠశాలల, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయు లు, విద్యాశాఖ అధికారు లు కళాశాలల ప్రిన్సిపల్స్ తో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు గత రెండు విద్యా సంవత్సరాల విద్యార్థుల ఉత్తీర్ణత, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థుల నమోదు పాఠశాలల మౌలిక సదుపాయాలు, భవనాల పరిస్థితి, మంచినీరు, మరుగుదొడ్ల తదితర సదుపాయాల అంశాలపై విస్తృతంగా చర్చించారు. పాఠశాలలో నెలకొని ఉన్న ప్రతి సమస్యను నిర్ణయంగా తన దృష్టి తీసుకురావాలని తద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. పాఠశాలలో నెలకొ న్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించాలని కోరారు విద్య ప్రమాణాలు మెరుగుపరచాలని అన్నారు.

# ఈనెల 25 నుండి ఇంటింటి ఓటర్ గణన ప్రారంభం

- **బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సులో భద్రాచలం తహసీల్దార్ కోట రవికుమార్**

**భద్రాచలం టౌన్ , జూన్ 20 ప్రజాజ్యోతి** స్పెషల్ ఇంటెన్సిల్ రివిజన్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగాలంటే బూత్ లెవెల్ ఆఫీసరట్లతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా కీలక పాత్ర పోషిస్తారని భద్రాచలం తహసీల్దారు కోట రవికుమార్ తెలిపారు. ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నేపథ్యంలో శనివారం స్థానిక సన్ కలెక్టర్ కార్యాలయంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రవికుమార్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లందరూ సరక్ష ప్రక్రియలో పాల్గొనాలని, ఓటరు గణనలో భాగంగా బీఎల్వోలు ప్రతి ఇంటిని మూడుసార్లు సందర్శిస్తారని అన్నారు. ఈనెల 25 నుంచి ఇంటింటి గణన ప్రారంభమవుతుందని, జూలై 24 వరకు కొనసాగుతుందని, జూలై 31న డ్రాప్ట్ ముసాయిదాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అభ్యంతరాలు, నోటీసులు అందజేస్తామని అభ్యంతరాలు, ఫిర్యాదులను ఆగస్టు 28 వరకు విచారణ చేసి దృవీకరణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అక్టోబరు ఒకటిన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని అన్నారు. ఇప్పటికే 85 శాతం ఓటరు మ్యాపింగ్ పూర్తయ్యిందని, బీఎల్వోలకు పూర్తిస్థాయిలో



సహకరించాలని, ప్రజాస్వామ్య బలోపేతంకు, పారదర్శకతకు ఓటరు జాబితా ఎంతో అవసరమన్నారు. అలాగే వివిధ పార్టీల బీఎల్ఏలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణి వనజ మృతిపై ఇరువురి విచారణ



**గుండాల జూన్. 20 ప్రజా జ్యోతి** గర్భిణి వనజ మృతి ఘటనపై విచారణ వేగవంతం చేస్తున్నారు శుక్రవారం రాత్రి పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ తుకారం, డిసిహెచ్ఓ జి రవిబాబు విచారణ చేయగా శనివారం మాతా శిశు సంరక్షణ చైర్మన్, రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ సుధీర గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి విచారణ చేశారు గర్భిణి వనిజ మృతికి గల కారణాలను సంబంధిత డాక్టర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. వనజ డెలివరీ చేసే సమయంలో ఉన్న సిబ్బందిని ఒక్కొక్కరిని విచారించారు. రికార్డులు పరిశీలించారు. తను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ పూర్తిస్థాయి విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు మృతికి గల కారణాలను ఒక్కొక్కటిగా విచారించి పూర్తి వరాలను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.

## హాస్పటల్లో ఖాళీలు భర్తీ చేసి సమస్యలు పరిష్కరించాలి...సిపిఐ



**గుండాల. జూన్ 20. ప్రజా జ్యోతి** గుండాల హాస్పిటల్ లో ఖాళీలు భర్తీ చేసి సమస్యలను పరిష్కరించాలని జెడిఎ కు వినతి పత్రం ఇచ్చినట్లు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వాగబోయిన రమేష్ తెలిపారు శనివారం గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మృతి చెందిన వనజ ఘటనపై విచారణకు వచ్చిన జెడిఎ సుధీర కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు హాస్పిటల్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఊకే సమ్మయ్య, గడ్డం శ్రీను, ఎస్కే సాహెబ్, సనప చందు, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## వనజ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- 20 లక్షలు ఎక్స్ కేసియా ఇవ్వాలి న్యూ డెమోక్రసీ

**గుండాల.. జూన్ 20. ప్రజా జ్యోతి** గర్భిణి వనజ కుటుంబానికి 20 లక్షలు చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్యంగానికి వచ్చిన పినపాక ఎమ్మెల్యే పాయా వెంకటేశ్వర్లకు న్యూ డెమోక్రసీ బృందం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు విచారణకు వచ్చిన జాయింట్ డైరెక్టర్ సుదీర్ కు న్యూ డెమోక్రసీ బృందం వీధి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, జిల్లా నాయకులు కోరం సీతారాములు మాట్లాడుతూ గర్భిణి వనజ మృతి చాలా బాధాకరమన్నారు ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వసతులు లేని కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఉండాలా ఆస్పత్రిలో సిబ్బంది లేరని ఒకే ఒక డాక్టర్ ఉన్నారని సిబ్బందితో పాటు డాక్టర్లను నియమించాలని కోరారు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లకు వివిధ సమస్యలను తన దృష్టి తీసుకుపోయి డిమాండ్లతో కూడిన వ్యక్తి పత్రాన్ని అందించామన్నారు విచారణకు వచ్చిన రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ సుధీరకు హాస్పిటల్లో ఉన్న సమస్యలను వివరిస్తూ వినతి పత్రం ఇచ్చామని తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు యాసారపు వెంకన్న గడ్డం లాలయ్య, ఈసం కృష్ణ, పర్షిక రవి, తదితరులు పాల్గొన్నారు.





# పోక్సో చట్టానికి పాల్వంచలో చుక్కెదురు..?

- రాజకీయ ఒత్తిళ్ల ముందు చట్టం మోకరిల్లిందా..?
- తెరవెనుక ఉన్నదెవరు..?
- రాజకీయ, మెడికల్ పలుకుబడి కేసును ప్రభావితం చేస్తున్నాయా..?
- పాల్వంచలో పోక్సో చట్టం అబాసుపాలు కానుందా..!
- మైనర్ బాలిక కేసులో నెల రోజులుగా నీరుగారుతున్న దర్యాప్తు
- రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్ల నీడ అడ్డుకుంటున్నాయా..? : బాధిత కుటుంబం ఆవేదన




**కొత్తగూడెం / పాల్వంచ, జూన్ 20 ( ప్రజాజ్యోతి )** మైనర్ బాలికల రక్షణ కోసం కేంద్రం తీసుకొచ్చిన పోక్సో చట్టం పాల్వంచలో సమర్థంగా అమలవుతోందా లేదా అన్న ప్రశ్నలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మైనర్ బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించాడనే ఆరోపణలతో నెల రోజుల క్రితం పాల్వంచ పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు నమోదైంది. అయితే కేసు నమోదై 30 రోజులు దాటినా దర్యాప్తులో గణనీయమైన పురోగతి కనిపించడం లేదని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సాధారణంగానే తిరుగుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. చట్టం ముందు అందరూ సమానమే అన్న భావనను బలపరిచేలా గతంలో అనేక కీలక కేసుల్లో పోలీస్ శాఖ వేగంగా చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ కేసులో జాప్యంపై స్థానికంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

### అర్ధరాత్రి ఒత్తిళ్లు... ఫోన్ కాల్స్ కలకలం

బాధిత కుటుంబం చెబుతున్న వివరాల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్ మార్కెట్ యజమాని స్థానికంగా నివసించే మైనర్ బాలికతో సన్నిహితంగా ఉండేందుకు పలుమార్లు ప్రయత్నించాడని ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో బాలికతో మాట్లాడేందుకు ప్రయత్నించాడని ఇంటి వద్దకు వచ్చి మాట్లాడాలని ఒత్తిడి చేశాడని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అలాగే ఫోన్ ద్వారా సంప్రదించి బాలికను కిందకు రావాలని కోరినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ఉంటే మాట్లాడుకుందాం అంటూ ఒత్తిడి తీసుకొచ్చారని బాలిక భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం జరిగిందని వారు చెబుతున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు తెలిపారు.

### కేసు నమోదు చేసిన పోలీసులు... ఆ తర్వాత నిశ్శబ్దమే..?

పోక్సో వంటి సున్నితమైన కేసులో ఇప్పటివరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై తదుపరి చర్యలు కనిపించకపోవడంపై అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజులు గడిచినా దర్యాప్తులో స్పష్టమైన పురోగతి లేదని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. కేసు గురిం చి ఆరా తీస్తే కొందరు అధికారులు నిరుత్సాహపరిచే విధంగా స్పందిస్తున్నారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. మా కూతురికి న్యాయం జరుగుతుందా లేదా..? పోలీసులు ఎవరి కోసం వేచి చూస్తున్నారో అర్థం కావడం లేదు అని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తెరవెనుక నడిపించేదెవరు..?

పాల్వంచలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన అంశం ఇదే. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి స్థానికంగా కొందరు రాజకీయ నాయకులు, అలాగే మెడికల్ రంగానికి చెందిన పలుకుబడి ఉన్న వ్యక్తుల మద్దతు ఉందనే ప్రచారం సాగుతోంది. స్థానికంగా కొందరు వ్యక్తుల పేర్లు ఈ చర్చల్లో వినిపిస్తున్నాయని స మాచారం. కేసును రాజీ చేసుకునేలా కొందరు మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. పోక్సో కేసుల్లో రాజీకి చట్టపరంగా అవకాశం లేకపోయినా ఇటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయ నే వాదనలు స్థానికంగా వినిపిస్తున్నాయి. విచారణ ప్రక్రియలో బయటి వ్యక్తుల జోక్యం జరుగుతోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనిపై పోలీసులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### పోక్సో చట్టం పట్ల భయం పోతుందా...?

మైనర్ బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో చట్టం అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. కేసు నమోదైనా తదుపరి చర్యలు కనిపించకపోవడంతో చట్టం పట్ల భయం తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజులుగా దర్యాప్తు జాప్యానికి కారణం ఏమిటి..? బాధిత కుటుంబం చేస్తున్న ఆరోపణలపై విచారణ జరిగిందా..? కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలపై పోలీసులు దృష్టి సారించారా..? బాధిత కుటుంబానికి రక్షణ కల్పించారా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పోక్సో కేసుల్లో జాప్యం అంటే బాధితురాలికి జరిగే రెండో దాడిగా నిపుణులు పేర్కొంటున్న సందర్భాలు నెలకొన్నాయి.

### పోక్సో కేసులో రాజకీయ ఒత్తిళ్లు ఏమన్నా ఉన్నాయా?

డబ్బు, పలుకుబడి ముందు చట్టం బలహీనపడుతోందా..? మైనర్ బాలికకు న్యాయం జరుగుతుందా..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిజానిజాలు ఏవైనా సరే వేగవంతమైన దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చట్టం అందరికీ సమానం అయినప్పుడు పోక్సో కేసు దర్యాప్తు ఆలస్యం వెనక కారణాలు ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### జిల్లా అధికారులు స్పందించాలి

ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీతో పాటు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు పురోగతిపై స్పష్టత ఇవ్వాలని బాధిత కుటుంబం కోరుతోంది. కేసు ఏ దశలో ఉందో.. జాప్యానికి కారణాలేమిటో బాధిత కుటుంబం చేస్తున్న ఆరోపణలపై విచారణ జరిగిందో లేదో వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. మైనర్ బాలికకు న్యాయం జరిగేలా పారదర్శకమైన వేగవంతమైన దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు. పోక్సో వంటి సున్నితమైన కేసుల్లో జాప్యం కూడా ప్రజల్లో అనుమానాలకు తావిస్తుందని అందువల్ల పూర్తి స్థాయి విచారణ ద్వారా నిజానిజాలను బయటపెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు వెన్నుపోటు

- చివరి గింజ కొనుగోలు చేయకపోతే జంగ్ సైరన్

**బూర్గంపహాడ్, జూన్ 20 (ప్రజా జ్యోతి ):** దేశానికి వెన్నెముకగా ఎదిగిన తెలంగాణ రైతులకు కాంగ్రెస్ సర్కార్ దారుణంగా వెన్నుపోటు పొడిచిందని, అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాథగా మార్చే దుర్మార్గానికి తెగబడిందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు సారపాక బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సారపాకలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తెలంగాణ ప్రజలకు, రైతులకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే అధికార అహంతో తెలంగాణ ప్రజలు, రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆగం చేసిందని మండిపడ్డారు. పదేళ్లపాటు పండుగలా మారిన వ్యవసాయాన్ని మళ్లీ దండగలా మార్చి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధును రూ.15వేలకు పెంచుతామని, అన్ని పంటలు చివరి గింజ వరకు కొనుగోలు చేసి రూ.500 బోనస్ చెల్లిస్తామని అబద్దపు హామీలిచ్చారని విమర్శించారు. ఇప్పటివరకు రైతులను ఏ మాత్రం ఆదుకోకుండా కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తూ రైతుల కంట కన్నీరు మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్కు ఉరి వేయడానికి రైతు డిస్కంలను తెరపైకి తెచ్చారని రైతు బీమాకు కనీసం ప్రీమియం కూడా చెల్లించకుండా 7600 మంది కుటుంబాలకు మొండిచెయ్యి చూపారన్నారు. పదేళ్లపాటు యూరియా కొరతను సృష్టించి రైతులను వేధించారని, ఇన్ని కష్టాలు పడి పండించిన పంటను 60 రోజుల పాటు కొనకుండా వేధించడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల ఇప్పటికే 1000 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయకపోతే బీఆర్ఎస్ మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని... 70లక్షల మంది రైతులు, 4 కోట్ల తెలంగాణ ప్రజలతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జంగ్ సైరన్ మోగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మీచైతన్యరెడ్డి, పాలకవర్గ సభ్యులు తిరుపతి ఏసోబు, నియోజకవర్గ యూత్ నాయకులు చల్లకోటి పూర్ణ, మాజీ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ బానోతు శ్రీను, బీఆర్ఎస్ నాయకులు కర్రి నాగేశ్వరరావు, పంగి సురేష్, సూదిపాక ఈశ్వర్, చట్టు ఆంజనేయులు, దాసరి మోహనరావు, బెజ్జంకి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.



# ఆపద వస్తే అండగా ఉంటా.. అధైర్య పడొద్దు

- సర్పంచ్ కుంజా వినోద్
- గాలి దుమారానికి ఇళ్లు కోల్పోయిన కుటుంబాల పరామర్శ
- నర్సాపురంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్న సర్పంచ్
- ఎమ్మెల్యే జారే సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా









**ములకలపల్లి,జూన్ 20(ప్రజాజ్యోతి):** ఆపద వస్తే అండగా ఉంటానని అధైర్య పడొద్దని" జగన్నాథపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కుంజా వినోద్ అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శి సునీష్, స్థానిక నాయకులతో కలిసి పంచాయతీ పరిధిలోని తోగ్గూడెం, రేగులకుంట, నర్సాపురం గ్రామాల్లో శుక్రవారం వచ్చిన గాలి దుమారానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం నర్సాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లగడపాటి భాస్కర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నర్సాపురం సొసైటీ గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో గ్రామ రహదారి బురదమయంగా మారుతుందని, వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అలాగే సున్నం నైవేద్య అనే చిన్నారికి 75 శాతం వైకల్యం ఉన్నప్పటికీ వికలాంగుల పింఛన్ అందడం లేదని కుటుంబ సభ్యులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని వెంటనే వివరాలు సేకరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పశువులు ఆవరణలోకి వస్తున్నాయని ఉపాధ్యాయులు, స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులు కోరిన సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం వంటి సమస్యలపై స్పందించిన సర్పంచ్ వినోద్, "ఈ అంశాలన్నింటినీ స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో త్వరలోనే పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పామర్తి కృష్ణ, సురభి రాజేష్, గుంట్రూ సాయిరాం, వెలకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతునే ఉన్నత భవిష్యత్తు

- భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ



**భద్రాచలం టౌన్ , జూన్ 20 ప్రజాజ్యోతి** విద్యార్థులకు చదువు ద్వారానే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ అన్నారు. శనివారం భద్రాచలంలోని బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేటి సమాజానికి భవిష్యత్ నిర్మాతలు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే చదువుకు ప్రత్యామ్నాయం లేదు. సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకొని, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి. మంచి విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని కూడా అలవర్చుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి' అని సూచించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అదే సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు సభ్యురాలు బొంతు రమణ విద్యార్థులతో కలిసి యోగా చేశారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు జి. జాన్సన్ గారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు పాఠశాల అభివృద్ధికి హామీ ఇవ్వడంతో పాటు విద్యార్థుల్లో చదువుపై స్ఫూర్తిని నింపే సందేశం ఇవ్వడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో విఫలం

- మోదీ పథకాలపై ప్రచారం చేయాలి
- కరణం సాయి పరిణితి



**కొత్తగూడెం, జూన్ 20 ( ప్రజాజ్యోతి )**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం సాయి పరిణితి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం రైతులకు రైతు భరోసా అందించలేకపోయిందన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులను నిరాశపరిచిందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదని, యువత నిరుద్యోగ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షుడు కే.వి. రంగా కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మ, పొ డియం బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యం బిక్షపతి, చెరుకు భాగ్యలక్ష్మి, మోహన్ కృష్ణ, డాక్టర్ వెంకన్న, భోగి కృష్ణయ్య, భూక్య దివ్యశ్రీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి అర్చన



**భద్రాచలం టౌన్ , జూన్ 20 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సందర్భంగా స్వర్ణ తులసి అర్చన నిర్వహించారు. అలాగే నిత్య కల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# రూ.12 లక్షల విలువైన గంజాయి, 30 లీటర్ల నాటుసారా పట్టివేత



**భద్రాచలం టౌన్, జూన్ 20 ప్రజాజ్యోతి** భద్రాచలంలో శనివారం ఎక్సైజు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు రూ.12 లక్షలు విలువ చేసే 21.100 కేజీల గంజాయి, 30 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. ఎస్సై సీహెచ్ శ్రీహరిరావు, సిబ్బంది కూనవరం రోడ్డులో ఇసుక రీచ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక పల్సర్ 150 వాహనంను ఆపి తనిఖీ చేయగా దాంటో 21.100 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ గంజాయిని మహారాష్ట్రకు చెందిన ఆజార్ షకీల్ షేక్, షకీల్ షేక్, అంకుష్ వినాయక్ పవార్, వినాయక్‌వార్‌లను అరెస్టు చేశారు. వీరు గంజాయిని ఏపీలోని చింతూరు నుంచి మహారాష్ట్రలోని తుల్జానగర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో ఓ ద్విచక్ర వాహనంపై 30 లీటర్ల నాటుసార తరలిస్తుండగా మడవి అయిత, చుక్కయ్య , కూరం అర్జున్‌లను అరెస్టు చేశారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్ శివకుమార్, వీరబాబు ,తిరుపతి, ఉపేందర్ , డ్రైవర్ సాయి కుమార్ లు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న తాటి



**ములకలపల్లి, జూన్ 20, (ప్రజాజ్యోతి):** మండలంలోని రాచన్నగూడెం గ్రామంలో శనివారం నిర్వహించిన నాభిశీల బొడ్రాయి, ముత్యాలమ్మ, శ్రీ పోతురా జు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బూర్గంపహాడ్ – అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ.10,000 విరాళం అందజేశారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ ఆయన మాట్లాడుతూ, ముత్యాలమ్మ, శ్రీ పోతురాజు స్వామి వారి దివ్య ఆశీస్సులతో రాచన్నగూడెం గ్రామ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆ కాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడకం విజయ , ఉప సర్పం చ్ వగ్గేలా వెంకటేష్, మాజీ సర్పంచ్ బైటి రాజేష్ , సర్పంచ్ వినోద్, పోతుగంటి లక్ష్మణ్, మీడియం బాబురావు వగ్గేల వీరస్వామి, మడకం లక్ష్మణ్ , ఊకె శ్రీను, మీడియం శ్రీను,ఊకె పరశురామ్, ఊకె శివ, కోర్స చెందు , కోర్స వెంకటేష్, ఊకె విజయకుమారి ఊకే సుశీల, మీడి యం ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

# పిడుగు పాటుకు ఎద్దు మృతి.. బాధిత రైతును ఆదుకోవాలని విజ్ఞప్తి



**టేకులపల్లి,జూన్ 20,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం గ్రామంలో శుక్రవారం పిడుగు పాటుకు ఓ ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు పూనెం నర్సయ్యకు చెందిన ఎద్దు ఇటీవల కురిసిన వర్షాల సమయంలో ఇంటి ప్రాగణంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పిడుగు కారణంగా ఎద్దు మృతి చెందడంతో రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లిందని పేర్కొంటూ,ప్రభుత్వం,సంబంధిత అధికారులు స్పందించి బాధిత రైతు పూనెం నర్సయ్యకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులే రైతులకు ప్రధాన ఆధారమని, ఇటువంటి ఘటనల సమయంలో ప్రభుత్వ సహాయం అవసరమని వారు తెలిపారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి సునీత, వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ పూర్ణచందర్, జీపీవో కన్నయ్య సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.అలాగే గ్రామ పెద్దలు దొడ్డ వసంతరావు, పాయం ముత్తయ్య, దొడ్డ రాజేష్,గుమ్మడి సునీల్,కోరం కాంతారావు,పడిగ నర్సింహారావు,దొడ్డ కాంతయ్య తదితరులు బాధిత రైతును పరామర్శించారు.

# చంద్రుగొండ రేంజ్ అటవీ అధికారికి సర్పంచుల అభినందనలు

- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి ):** చంద్రుగొండ రేంజ్ అటవీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తేజస్విని అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన పలువురు సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణిస్తూ అటవీ సంపద పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లం గ్రామ సర్పంచ్ కారం శివ ఆధ్వర్యంలో సీతాయగూడెం సర్పంచ్ పిట్టల రామలక్ష్మయ్య, గుర్రాయిగూడెం సర్పంచ్ పద్దం రమేష్, రవికంపాడు సర్పంచ్ బుక్యా సరిత కలిసి చంద్రుగొండ అటవీ కార్యాలయంలో తేజస్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.అటవీ సంపద పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ కార్యక్రమాల అమలులో గ్రామ పంచాయతీల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో హరితాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి డీఆర్వో లక్ష్మీపతి, బీట్ అధికారి నరసింహారావు, సంపత్ కుమార్, నాగరాజు, బాబురావు, మదన్ లాల్, రవి, కృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. నూతన అటవీ అధికారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ పూర్తి సహకారం అందిస్తామని సర్పంచులు పేర్కొన్నారు.

# వినియోగదారుడి హక్కులు గాలికొదిలేశారా..?

- నోటీసు లేకుండా వాహనం స్వాధీనం చట్టబద్ధమేనా..?
- అదనపు ఛార్జీలకు ఆధారం ఏమిటి..?
- అధికారుల జోక్యం ఎప్పుడూ..?
- కొత్తగూడెం లో ఫైనాన్స్ వసూళ్ల పేరుతో పెరుగుతున్న వివాదాలు




**కొత్తగూడెం, జూన్ 20 ( ప్రజాజ్యోతి )** రుణాలపై కొనుగోలు చేసిన వాహనాల విషయంలో వినియోగదారుల హక్కులు ఎంతవరకు రక్షించబడుతున్నాయనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. బకాయి కిస్తీల పేరుతో వాహనాలను స్వాధీనం చేసుకోవడం అనంతరం అదనపు ఛార్జీల పేరుతో భారీ మొత్తాలను డిమాండ్ చేయడం ముందస్తు నోటీసుల విషయంలో స్పష్టత లేకపోవడం వంటి అంశాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ బైక్ ఫైనాన్స్ వివాదం ఈ అంశాలను మరోసారి చర్చనీయాంశంగా మార్చింది. చుంచుపల్లి మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన గడ్డం మోహన్‌రావు 2025 అక్టోబర్ లో రూ.1.60 లక్షల విలువైన హోండా యూనికార్న్ బైక్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. రూ.40 వేల డౌన్‌పేమెంట్ చెల్లించిన అనంతరం మిగిలిన మొత్తానికి ఫైనాన్స్ సదుపాయం కల్పించినట్లు తెలుస్తోంది. వాహనం కొనుగోలు ప్రక్రియను చెరుకూరి కార్పొరేషన్ నిర్వహించగా ఫైనాన్స్ ఒప్పందం హిందూజా లేలాండ్ ఫైనాన్స్ పేరుతో జరిగినట్లు బాధితుడు చెబుతున్నాడు. నెలకు రూ.5,271 చొప్పున కిస్తీలు చెల్లిస్తూ వచ్చిన మోహన్‌రావుకు కొన్ని నెలలుగా కిస్తీలు బకాయి ఉన్నాయని పేర్కొంటూ వసూళ్ల ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది. తన వద్ద ఉన్న మొత్తాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ వినిపించుకోకుండా తన కుమారుడి వద్ద నుంచి వాహనాన్ని తీసుకెళ్లినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు.

### ››› వాహనం స్వాధీనం చేసుకునే అధికారం ఎవరిది..?

ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా వినియోగదారుడి కుమారుడు ని బెదిరించి యువకుడి వద్ద ఉన్న వాహనాన్ని బలవంతంగా లాక్కొని వెళ్లే అధికారం ఎవరికి ఉందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైనాన్స్ పేరా వాహనాన్ని బలవంతంగా తీసుకెళ్తే దానికి బాధ్యులు ఎవరు అంటూ ఆగ్రహిస్తున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న వినియోగదారులకి కనీస సమాచారం నోటిస్ ద్వారా అందించే పద్ధతి కూడా ఫైనాన్స్ సెక్టర్లకు లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. అసలు వాహనాన్ని విక్రయించిన సంస్థ ఒకటి, ఫైనాన్స్ సంస్థ మరోటి అయితే వాహన స్వాధీన ప్రక్రియను నిర్వహించేది ఎవరు..? ఫైనాన్స్ సంస్థ అధికార ప్రతినిధులేనా..? లేక డీలర్ సంస్థ సిబ్బందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సంబంధిత సంస్థలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### ››› వాహనదారుడుకి ముందోస్తు నోటీసులు ఇచ్చారా..?

ఫైనాన్స్ రంగంలో రుణగ్రహీతకు ముందస్తు సమాచారం ఇవ్వడం బకాయిల వివరాలు తెలియజేయడం చెల్లింపులకు అవకాశం కల్పించడం వంటి ప్రక్రియలు కీలకంగా పరిగణిస్తారు. ఈ కేసులో అలాంటి ప్రక్రియలు పూర్తిగా అనుసరించారా లేదా అన్నది అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. బాధితుడు మాత్రం తనకు తగిన సమాచారం ఇవ్వలేదని వాదిస్తున్నాడు. వాహనం తిరిగి పొందేందుకు పెండింగ్ కిస్తీలతో పాటు సీజింగ్ ఛార్జీలు, ఇతర ఖర్చుల పేరుతో అదనపు మొత్తాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అదనపు ఛార్జీలు ఏ నిబంధనల ప్రకారం విధించబడుతున్నాయి..? వాటి లెక్కలు వినియోగదారుడికి వివరించారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ››› వినియోగదారులకు న్యాయబద్ధమైన రక్షణ ఎక్కడా...?

ఫైనాన్స్ సంస్థలు, రికవరీ ఏజెన్సీలు, డీలర్ సంస్థల మధ్య జరిగే వ్యవహారాల్లో చివరకు ఒత్తిడికి గురయ్యేది వినియోగదారుడేనన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. చట్టపరమైన అవగాహన లేకపోవడం న్యాయపోరాటానికి అయ్యే ఖర్చులు అధికార కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు సామాన్యులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వినియోగదారుల సంఘాలు పేర్కొంటున్నాయి. కొత్తగూడెంలో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంపై సంబంధిత ఫైనాన్స్ సంస్థలు, డీలర్ యాజమాన్యాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ విభాగం, జిల్లా యంత్రాంగం స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. బకాయిలు ఉంటే చట్టబద్ధంగా వసూలు చేసుకునే హక్కు సంస్థలకు ఉన్నట్లే వినియోగదారులకు కూడా న్యాయబద్ధమైన రక్షణ, పారదర్శక సమాచారం పొందే హక్కు ఉందన్న విషయాన్ని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# అన్నపురెడ్డిపల్లి మండల నూతన ఎంపీడీవోగా డి. రాజేశ్వరి బాధ్యతల స్వీకరణ

- ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని వెల్లడి



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల నూతన ఎంపీడీవోగా డి. రాజేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమెకు అధికారులు,సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డి. రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానన్నారు.

# యోగ దినోత్సవానికి సిద్ధమైన విద్యార్థులు

- ఆరోగ్యకర జీవనానికి యోగానే ఉత్తమ మార్గమని సూచన



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి ):** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం యోగాసనాలను సాధన చేశారు. జూన్ 21న నిర్వహించే యోగ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఉత్సాహంగా సన్నద్ధమయ్యారు.మండల విద్యాశాఖాధికారి ఆనంద్ కుమార్ 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ తమ ప్రాంతాల్లో నిర్వహించే యోగ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు శంకర మహదేవన్, సునంద రెడ్డి, శాంత కుమారి, రాజ్యలక్ష్మి ,బాబురావు,వెంకటేశ్వరరావు,బాలు,వసంత,సుశీల,పద్మ,మోతీలాల్, జయరాం,ప్రసాద్, శిరీష, ఖాసీం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి యోగపై అవగాహన పెంపొందించుకున్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన తోట దేవి ప్రసన్న



**సుజాతనగర్, జూన్ 20 ( ప్రజాజ్యోతి )** సుజాతనగర్ మండలం బేతాళుపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాన్ని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న శనివారం ప్రారంభించారు. లబ్ధిదారు కుటుంబంతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం నిర్వహించారు. అనంతరం ఇంట్లో పాలు పొంగించి దీపం వెలిగించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కిరాయి ఇళ్లలో నివసించే నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, బాలాజీ, లక్ష్మీనారాయణ, మహేష్, పురుషోత్తం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో నూతన దుస్తుల పంపిణీ

- అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమంలో చిన్నారులకు ప్రోత్సాహం



**లక్ష్మీదేవిపల్లి, జూన్ 20 (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు అంగన్వాడీ కేంద్రం (లక్ష్మీదేవిపల్లి సెంటర్–3) లో అక్షరాభ్యాసం, నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఈసం కళ్యాణి, ఉపసర్పంచ్ ఎస్కే యాకూబ్ పాషా ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి నూతన దుస్తులు పంపిణీ చేశారు. విద్యాభ్యాసానికి తొలి అడుగు వేస్తున్న చిన్నారులను అభినందిస్తూ వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. అంగన్వాడీ టీచర్ తాటి సరోజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులకు విద్య ప్రాధాన్యత, అంగన్వాడీ కేంద్రాల సేవలు, పోషకాహార కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ భద్రాద్రి జిల్లా కోఆర్డినేటర్ ఎం. జ్యోతిరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లోగాని శ్రీనివాస్, ఎస్జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ జాయింట్ సెక్రటరీ కళ్యాణి, కళావతి మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అంజలి, సుజాత, ఆయా జాలాది మణెమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గాలి వాన బీభత్సం – నేలమట్టమైన ఇళ్లు

- అరటి రైతులకు తీరని నష్టం







**ములకలపల్లి, జూన్ 20, (ప్రజాజ్యోతి):** మండలంలోని ఉమ్మడి జగన్నాథపురం పంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. జగన్నాథపురం, సీతాయిగూడెం, సూరంపాలెం, రాజాపురం గ్రామాల్లోని అరటి తోటలు నెలకొరగటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల ప్రభావంతో రేగులకుంట గ్రామానికి చెందిన కూరం నాగమణి, నర్సాపురానికి చెందిన పొట్ట రమేష్, తోగ్గుడెంకు చెందిన సున్నం సీతమ్మ, నల్లవారిగూడెంకు చెందిన సున్నం వరమ్మ, చింతగుంపుకు చెందిన పోడియం రాజు, మడివి సునీల్, పాత గంగారం గ్రామానికి చెందిన ఇర్ప పార్వతి ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్న ఇళ్లను స్థానిక గిర్దావర్ సోయం రాంబాబు, గ్రామ పరిపాలన అధికారి నవీన్ సందర్శించి పరిశీలించారు.

- ♦ బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకుడు కొప్పుల రాంబాబు

ఈదురుగాలులకు ధ్వంసమైన ఇళ్లను అశ్వరావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొప్పుల రాంబాబు స్థానిక నాయకులు వెంకట్రావు, గంగారం మాజీ సర్పంచ్ వాడ శేషగిరి, మడక శీను, సున్నం నాగేష్, జగన్నాథపురం పంచాయతీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సున్నం రాజుతో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలి వానల కారణంగా జరిగిన నష్టాన్ని అశ్వరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులను సంఘటన స్థలానికి పంపించినట్లు తెలిపారు. త్వరితగతిన స్పందించి అధికారులను పంపించిన ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందించి, అరటి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# ఈతకు వెళ్లి బాలుడు మృతి

- నర్సాపురం తండాలో విషాదఛాయలు





**గుండాల. జూన్ 20. ప్రజా జ్యోతి** స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఓ బాలుడు వాగులో మునిగి చనిపోయాడు. శనివారం గుండాల మండలం నర్సాపురం తండ కు చెందిన బాలురు ఇరువురు కలిసి సరదాగా పక్కనే ఉన్న మల్లన్న వాగు లోకి ఈతకు వెళ్లి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది వివరాలు ఇలా ఉన్నాయి నర్సాపురం తండాకు చెందిన గుగులోత్ దేవా కల్పన దంపతుల కుమారుడు సీమన్ (12) తన స్నేహితులు సంజు, వేణులు కలిసి సరదాగా పక్కనే ఉన్న మల్లన్న వాగులోకి వెళ్లారు. సీమన్, వేణులు వాగులోకి దిగారు ఒక్కసారిగా మునిగిపోతుండగా ఒడ్డుపై ఉన్న సంజు దగ్గరలో ఉన్న గుడి వద్దకు వెళ్లి విషయాన్ని అక్కడున్న గ్రామస్తులకు విషయాన్ని చెప్పారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పరుగు పరుగున వాగు వద్దకు వెళ్లగా వేణు మునుగుతూ కనిపించాడు, వేణును కాపాడిన గ్రామస్తులు సీమన్ ను వెతకడం ప్రారంభించారు రెండు గంటల అనంతరం సీమన్ శవమై కనిపించారు సీమన్ మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి గుండాల ఎస్సై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు తరలించారు.

# ఉపాధ్యాయుడిపై డాక్టర్ దాడి ఆరోపణలు

- చర్యలకై ఆదివాసీ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్





**చర్ల, జూన్ 20 (ప్రజాజ్యోతి ):** చర్ల ప్రభుత్వాసుపత్రిలో గిరిజన ఉపాధ్యాయుడు పలక నాగేశ్వరావుపై జరిగిన దాడి ఘటనపై సంబంధిత వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ, వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన ఉపాధ్యాయుడు కారుకు అడ్డంగా బైక్ ని పార్క్ చేసారని తలెత్తిన వాగ్వాదం వలన పలక నాగేశ్వరావుతో డాక్టర్ కృష్ణ ప్రసాద్ అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు.ఉపాధ్యాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, భౌతిక దాడికి పాల్పడినట్లు పేర్కొంటూ ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య వృత్తిలో ఉన్నవారు రోగులతో మర్యాదపూర్వకంగా మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని ఇటువంటి ఘటనలు వైద్య వృత్తి ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు సేవలందించాల్సిన వైద్యులు వృత్తి ధర్మాన్ని పాటించాలని ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విధుల నుంచి సస్పెండ్ చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఊయికే బాలకృష్ణ, శ్యామల రామారావు, ఎస్.ఎస్.ఎస్. రవికుమార్, నీలం వెంకటరమణ, కుర్ల రాము, చిడం హిమగిరిబాబు, పూనెం వెంకటరమణ, తోటపల్లి రమేష్, కుర్ల మోహన్‌రావు, కాపుల కృష్ణార్జునరావు, సూరిబాబు, సోయం దేశవీర్రాజు, ఇరుప రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం

- అన్నప్రసాద వితరణ కోసం వంట పాత్రలు అందజేసిన అప్పన పుల్లారావు, సరిత దంపతులు
- గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన సన్నిధిలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. పాల్వంచ వాస్తవ్యులు చొప్పవరపు మోహన్ వంశీకృష్ణ, పూర్ణసాయి, నీహాన్స్ కృష్ణశేఖర్ బాబు, విజయలక్షి దంపతులు స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఖమ్మం వాస్తవ్యులు అప్పన పుల్లారావు, సరిత దంపతులు ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఉపయోగపడే సుమారు రూ.1.10 లక్షల విలువైన వంట పాత్రలను విరాళంగా అందజేశారు. వారి సేవాభావాన్ని ఆలయ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఆలయ మేనేజర్ పి.వి. రమణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.



